హుజూర్‌నగర్ సభ హిట్
ఉత్తమ్ వ్యూహాలు కట్

చెప్పిందే కాదు..
చెప్పనిదీ చేసేవాడే కేసీఆర్

కాంగ్రెస్ ఉరఫ్ కుటుంబపాలన
బీఆర్ఎస్ కేరాఫ్ ప్రజాపాలన

ఓటర్లు చేస్తారు బీఆర్ఎస్‌కు ఫేవర్
ప్రతిపక్ష నేతలకు వస్తుంది ఫీవర్

-మాలోతు సురేష్

**91827 77222**

హ్యాట్రిక్ ఎలక్షన్- హ్యాట్రిక్ కేసీఆర్ కాన్సెప్ట్‌తో అసెంబ్లీ ఎన్నికల స్పెషల్ 'తెలంగాణ జైత్రయాత్ర'కు మీ నినాదాలు పంపాల్సిన వాట్సాప్ నెంబర్ ఇదీ.. మీ పేరు, ఫొటో పంపడం మర్చిపోకండి.

## నాడు-నేడు

• కడివెడు కష్టం..



తెలంగాణ రాకముందు మంచినీటి కష్టాలకు తార్కాణం ఈ చిత్రం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలంలోని గిరిజన గ్రామాల ప్రజలు తాగునీటికి గోస పడేవారు. కడివెడు నీళ్ల కోసం ఊరి పొలిమేరలు దాటి.. వాగులు చేరి.. చెలిమెలు తవ్వుకున్న వాళ్ల కష్టం గురించి ఎంత చెప్పుకొన్నా తక్కువే! మండుటెండల్లో మాత్రమే కాదు, వానకాలంలోనూ నీటి ఎద్దడి తప్పేది కాదు. గిరిజన గ్రామాలు దప్పికతో అల్లాడుతున్నా గుక్కెడు నీళ్లు ఇవ్వాలని ఆలోచించలేదు నాటి పాలకులు.

• బిందెడు సంతోషం..



మిషన్ భగీరథ ఫలితాలు ఏ పట్నానికో పరిమితం కాలేదు. ఇంద్రవెల్లి కాన నుంచి ఇల్లెందు కోన వరకు భగీరథ జలాలు జనాల గొంతు తడిపాయి. కండ్లముందుకు వచ్చిన గంగమ్మను చూసి ముసలవ్వలు ఇలాంటి రోజు వస్తుందని ఏనాడూ ఊహించలేదని మురిసిపోతున్నారు. తరతరాలుగా చూడని కానుకను అందించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నిత్యం తలుచుకుంటున్నారు. ఇల్లెందు మండలం విజయలక్ష్మీనగర్‌లో భగీరథ ట్యాంక్ నీడలో నీళ్లు పట్టుకుంటున్న ఈ పెద్దవ్వ ఇప్పుడు నిత్య సంతోషిణి.

ఫన్‌టాస్టిక్

## దమ్ములేని పలుకు


ఖల్ .. ఖల్ ..
'దగ్గా సార్ ?'
'కాదు దమ్ము...'
'మీకు దమ్ము కూడా ఉందా?'

'కూడా ఉందా ? ఏమిటీ ? మనకున్నదే అది. సరే టీవీలో వార్తలు చూస్తే నీకేమనిపిస్తుంది? అదే హస్తం వాళ్ళు, కమలం వాళ్ళు టికెట్లు ఇచ్చిన తరువాత కొట్టుకుంటున్నారు. చనిపోతా అని కిరోసిన్ పోసుకున్నారు. వీటిని చూస్తే నీకేమనిపిస్తుంది?'

'ఒక పద్ధతి పాడు లేని వీళ్ల చేతిలో రాష్ట్రం పెడితే ఇంకేమైనా ఉందా ? కుక్కలు చింపిన విస్తరి అవుతుంది. టికెట్లే సరిగా ఇవ్వలేని వారు ఎన్నికల్లో ఏం గెలుస్తారు సార్ ...'

'చూడోయ్ సుబ్బారావు దమ్మున్న నా మీడియాలో నీకు జీతం ఇచ్చేది రాష్ట్రం మంచి చెడులు ఆలోచించమని కాదు. ప్రతి న్యూసెన్స్ నుంచి ప్రయోజనం పొందాలి. ఇలా కొట్టుకుంటున్న వారితో ఓ పార్టీ పెట్టించి వారికి మనం సలహాదారులుగా ఉంటే ఎలా ఉంటుంది?'

'ఆ...'



'మౌనంగా ఉంటావేం చెప్పు?'
'మీరేం చేసినా బాగానే ఉంటుంది. మీరు జీతమిచ్చే దమ్మున్న బాస్.'
'అది కాదు .. ఫరవాలేదు. నువ్వు ఏమనుకుంటున్నావో చెప్పు?'

'సార్... బయట మార్కెట్‌లో టాక్ చెబుతాను. ఇప్పటికే మీరు అటు హస్తానికీ, ఇటు కమలానికీ ప్రధాన సలహాదారు. ఆ ఇరు పక్షాలు మీతో టచ్‌లో ఉంటాయి. ఏ పార్టీని మీరు ఆశీర్వదించినా ఆ పార్టీ మటాష్ అవుతుందని, మీది భస్మాసుర హస్తం అని టాక్.'

ఈ టాక్ నేనూ విన్నాను. నువ్వేమనుకుంటున్నావు. చెప్పకపోతే ఉద్యోగం ఊడుతుంది. చెప్పు?'

'మీ ట్రాక్ రికార్డ్ అలానే ఉంది. తెలంగాణ ఉద్యమంలో విజయశాంతిని ఆకాశానికెత్తారు. ఆమె పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశలు కల్పించారు. కోదండరాం, గద్దర్, ఇంటి పార్టీ వారూ అనే కాదు, లెక్క లేనంత మందిని మీడియాతో అధికారంలోకి వచ్చేసినట్టు చూపించారు. వారంతా అడ్రస్ లేకుండా పోయారు. ఆంధ్రాలో జగన్‌ను వ్యతిరేకిస్తూ తెలంగాణలో వారి సోదరిని కాబోయే సీఎం అని ఆకాశానికెత్తారు. మీ న్యూస్‌ను నమ్మి ఆమె కూడా నేనే కాబోయే సీఎంను అని యూట్యూబ్‌లకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఇప్పుడు చాలా మంది వాటిని కామెడీ పీసులుగా చూపిస్తున్నారు. ఆమె పార్టీకి క్యాండిడేట్‌లు దొరకడం లేదు.

'చూడోయ్ మనది బిజినెస్. ప్రతి దానిలో లాభం చూసుకోవాలి. అందరితో పార్టీలు పెట్టించాం. దాని వల్ల మన మీడియాకు బోలెడు వార్తలు, వాళ్లిచ్చే ప్రకటనలతో ఆదాయం, అందరూ మన గురించి మాట్లాడుకుంటారు.

'వావ్ .. నిజంగా మీకు దమ్ముంది సార్. కానీ క్రెడిబులిటీ?'

'క్రెడిబులిటీనా వంకాయా? ఇంతకూ కమలం, హస్తం అసంతృప్తి వాదులను చూసి నేను ఎందుకు నవ్వానో తెలుసా? రెండు పార్టీల అసంతృప్తి వాదులను కలిపి మనం హస్త కమలం అని ఓ కొత్త పార్టీ పెట్టిస్తున్నాం. చేతిలో పువ్వు పార్టీ గుర్తు. వాళ్లని రమ్మని పిలువు.'

'సార్ ఓ చిన్న డౌట్. ఇప్పటి వరకు మీరు ఎన్ని పార్టీలు పెట్టించారు?' 'ఓ డజను.' 'ఆ పార్టీల నుంచి ఒక్కరైనా గెలిచారా?' 'ఒక్కరూ గెలవలేదు.' 'ఎందుకు?'

'ప్రజలు తెలివైన వాళ్ళు. ఏం చేయాలో వారికి తెలుసు. మీరంటే నా ఉద్యోగులు కాబట్టి నా మాట వింటారు. ప్రజలెందుకు వింటారు.'

■ మురళి

ద లీడర్..



## విద్యార్థి ఉద్యమ కెరటం

### బాల్క ఫౌండేషన్‌తో సామాజిక సేవ

### చెన్నూర్ దశ మార్చిన యువనేత

తెలంగాణ ఉద్యమంలో లక్షలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ వెన్నంటి ఉప్పెనలా కదిలారు. అందులో ఉస్మానియా విద్యార్థి బాల్క సుమన్ ఒకరు. తండ్రి అందించిన రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి రాజకీయాల్లో కీలక భూమిక పోషించారు. విద్యార్థి లోకాన్ని ఉద్యుక్తులను చేశారు. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న ఉద్యమానికి బాసటగా నిలిచారు. కేసీఆర్ వెంటే నడిచారు.

ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. బాల్క ఫౌండేషన్ ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. ఉన్నత చదువులకు, కష్టాల్లో ఉన్న పేదలకు ఆర్థిక సాయం, 3వేల మందికి ఉచిత కోచింగ్ ఇప్పించారు. పోలీస్ ట్రైనింగ్ సెంటర్లు నిర్వహించగా అక్కడ ట్రైనింగ్ తీసుకున్న వారిలో 30 మందికి ఉద్యోగాలు వచ్చాయి.

**తండ్రి రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని...**

బాల్కసుమన్ స్వస్థలం జగిత్యాల జిల్లా, మెట్‌పల్లి మండలంలోని రేగుంట గ్రామం. తండ్రి బాల్క సురేశ్ మెట్‌పల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. అదే స్ఫూర్తితో సుమన్ 2001లో టీఆర్ఎస్‌లో చేరి రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 2007లో ఓయూలో టీఆర్ఎస్వీ అధ్యక్షుడిగా, 2010లో టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం జరిగిన తొలి ఎన్నికలో 2014లో పెద్దపల్లి నుంచి టీఆర్ఎస్ పార్టీ తరపున ఎంపీగా పోటీచేసి గెలుపొందారు. 2018లో చెన్నూర్ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి భారీ మెజారిటీతో గెలుపొందారు. ప్రభుత్వ విప్ పదవిలో ఉన్నారు. ప్రస్తుతం మళ్లీ చెన్నూరు నియోజకవర్గం నుంచి బరిలో నిలిచారు.



**చెన్నూర్ దశ మార్చిన యువనేత..**

యువనాయకుడు బాల్క సుమన్ ఆధ్వర్యంలో చెన్నూర్ నియోజకవర్గం దశ మారింది. ప్రజల చిరకాల స్వప్నమైన చెన్నూర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటయ్యింది. బస్ డిపో మంజూరయ్యింది. అస్నాద్, పారుపల్లిలను రెండు కొత్త మండలాలుగా ఏర్పాటు చేశారు. 100 పడకల జనరల్ హాస్పిటల్ పనులు పురోగతిలో ఉన్నాయి. 50 పడకల మాతా,శిశు సంక్షేమ ఆసుపత్రిని ప్రారంభించారు. మందమర్రిలో రూ.500 కోట్లతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. చెన్నూర్ నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించే లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చకచకా సాగుతున్నాయి. ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ..కాంగ్రెస్ కుర్చీలాట

మొదటి పేజీ తరువాయి...

కారణాలున్నాయి. జాతీయ అంశాలు కొన్నయితే... స్వార్థ రాజకీయ శక్తుల కుటిల యత్నాలు కూడా హైదరాబాద్‌ను... హైదరాబ్యాడ్ అనే పేరిట పత్రికలకు ఎక్కించాయి. 1978 మొదలుకొని ఏటా మత కలహాలకు తోడు హత్యలు, మారణకాండలు, దోపిడీలు, దొమ్మీలు చోటుచేసుకునేవి. ప్రతి ఎన్నికల సమయంలో ఓటు రాజకీయ క్రీడల్లో కత్తిపోట్లు చోటు చేసుకునేవి. దీంతో పెట్టుబడులు రాక, ఉపాధి అవకాశాలు పెరగక.. హైదరాబాద్ ఆగమైంది. 1978 నుంచి 1985 వరకు ఏటా మత ఘర్షణలు జరిగాయి. తర్వాత మూడేండ్లు కాస్త ప్రశాంతంగా కనిపించినా.. మళ్లీ 2012 వరకూ హైదరాబాద్‌ను ప్రతి సంవత్సరం కర్ఫ్యూ పలకరించింది. 37 ఏండ్లలో జరిగిన ఘర్షణల్లో 554 మంది ప్రాణాలు కోల్పోగా, 4,798 మంది గాయాలపాలైనట్టు పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. కానీ, వాస్తవ సంఖ్య ఇంతకన్నా ఎక్కువగా ఉంటుందనేది నిజం. అప్పటి పరిస్థితి ఎలా ఉండేదంటే... 'అరెరెరె ఏందిరన్న ఏం జేస్తమన్న ఎటు జూస్తమన్న బందు.. ' పాట నగర పరిస్థితికి అద్దం పడుతుంది.

### ● ప్రజాస్వామ్యం అపహాస్యం..

హైదరాబాద్ ప్రస్థానంలో 1990లో జరిగిన మత ఘర్షణలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశాయి. మర్రి చెన్నారెడ్డి 1989, డిసెంబరు మూడో తేదీన సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. మరుసటి ఏడాదే నగరంలో రెండుసార్లు మత ఘర్షణలు చెలరేగాయి. 1990 అక్టోబరు 29న చోటుచేసుకున్న ఘర్షణలతో 23 రోజుల పాటు నిరవధిక కర్ఫ్యూ కొనసాగింది. తర్వాత 10-15 రోజుల్లోనే మళ్లీ మొదలైన



ఘర్షణలు హైదరాబాద్‌ను అట్టుడికించాయి. ఈ దఫా కూడా 25 రోజుల పాటు కర్ఫ్యూ విధించారు. అధికారిక లెక్కల ప్రకారం ఆ ఏడాది జరిగిన హింసలో 208 మంది చనిపోగా, 470 మంది గాయపడ్డారు. అయితే వాస్తవానికి ఇవి మత ఘర్షణలు కావని, కుర్చీల కొట్లాటలో కాంగ్రెస్ నాయకులు సృష్టించిన ఘర్షణలు అని స్వయానా అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి ప్రకటించడం గమనార్హం. అంటే.. అధికారం కోసం అమాయక జనాన్ని సైతం పొట్టన పెట్టుకునే రాజకీయ సంస్కృతి ఉందనే కఠోర వాస్తవం బయటి ప్రపంచానికి తెలిసింది.



## ఈ పోటీతత్వం దేనికి సంకేతం?!

*తాజా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాలు బుద్ధిజీవులను ఆలోచింపజేస్తున్నాయి. ఈ పరిణామాలు దేనికి సంకేతం? అని వారిలో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆలు లేదు... చూలు లేదు.. కానీ అప్పడే కాంగ్రెస్ పార్టీలో సీఎం పదవి కోసం కిస్సా కుర్చీకా! పందేరం మొదలైంది.*

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తానే ముఖ్యమంత్రిని అంటూ ఏకంగా డిసెంబరు 9న ప్రమాణ స్వీకారం చేస్తానంటూ చెప్పుకుంటున్నారు. కొడంగల్ నియోజకవర్గ ప్రచారంలో భాగంగా ఆయన సోదరులు బహిరంగంగానే రేవంత్ సీఎం అవుతాడంటూ చెబుతున్నారు.

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తన సీనియారిటీతో పాటు సామాజిక కోణంలోనూ సీఎం కుర్చీ తనదేనని పరోక్షంగా బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. సీఎం రేసులో తానున్నట్లుగా స్పష్టం చేస్తున్నారు.

ఆ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి అసెంబ్లీకి పోటీ చేయకున్నా... తాను కూడా సీఎం రేసులో ఉన్నానని ప్రకటించుకున్నారు. ఒకడుగు ముందుకేసి... ఆ సమయమొస్తే సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఎలాగూ ఆర్నెల్ల సమయం ఉంటున్నందున తన కొడుకును రాజీనామా చేయించి, ఆ స్థానం నుంచి గెలుస్తానని చెప్పడం గమనార్హం.

నల్లగొండ జిల్లాకే చెందిన మరో సీనియర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం తనకూ ముఖ్యమంత్రి అయ్యే అర్హతలు ఉన్నాయంటూ మదిలోని మాటను బయట పెట్టారు.

మరో సీనియర్ నేత జగ్గారెడ్డి సైతం తనకూ ముఖ్యమంత్రి కావాలని ఉందంటూ ప్రకటించారు.

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా గతంలో ఇలాంటి సంకేతాలే ఇచ్చారు.

**ఇలా... కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి అభ్యర్థులమంటూ ముందుగా ప్రకటించుకున్న వారు వీరైతే! ఇంకా కొంతమంది సమయం కోసం వేచి చూస్తున్న వాళ్లూ ఉన్నారు. టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి రేవంత్‌రెడ్డితోపాటు వచ్చిన ములుగు ఎమ్మెల్యే సీతక్క కూడా సీఎం రేసులో ఉన్నట్లు సాక్షాత్తూ టీపీసీసీ అధ్యక్షుడు ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. 'సామాజిక కోణం అంశం వచ్చినపుడు గిరిజనురాలైన సీతక్క సీఎం ఎందుకు కాకూడదు?' అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానిస్తూ తన తరపున ఆమెను తెరపైకి తీసుకువచ్చారు.**

■ సామాన్యుడి మాట

## సుస్తీ చేస్తే బస్తీలోనే వైద్యం



పొద్దుగాల పది గంటల నుంచి రాత్రి ఏడు గంటల దాక డాక్టర్లు ఉంటున్నరు. దగ్గు, జెరం, షుగర్, బీపీ గోలీలు ఉత్తగనే ఇస్తున్నరు. గర్భిణులకు టెస్టులు చేస్తున్నరు. బలం గోలీలు ఇస్తున్నరు. ఈడికి వచ్చే ఓపిక లేకపోతె ఫోన్ చేస్తె సుత మందులు చెప్తున్నరు. బస్తీ దవాఖానలు వచ్చినంక మాకు చాలా పాయిదా అయితుంది. ఒకప్పుడు జెరమొస్తే ఖైరతాబాద్‌కో, గాంధీకో పోతుంటిమి. పొద్దంతా దవాఖాన సుట్టు తిరుగుడుకే సరిపోయేది. లేదంటే.. ప్రైవేట్ డాక్టర్. ఆడికి పోతే పైసల్ జాడియ్యాల్సి వస్తుండె. పేదోళ్ల పానాల గురించి, ఆరోగ్యం గురించి ఆలోచించి కేసీఆర్ చేసిన బస్తీ దవాఖాన ఆలోచన మా అసోంటి పేదలకు ఎంతో మేలు చేశింది. ఇక్కడ గోలీలు ఫ్రీగ వస్తున్నయ్. మా గల్లీల ఉన్న దవాఖానకే రోజుకు వందలమంది వస్తుంటరు. డాక్టర్లు కూడా ఓపికగ చెక్ చేశి చెప్తున్నరు. అసోంటిది హైద్రాబాద్ మొత్తంల ఉన్న బస్తీ దవాఖానాలు ఎంతమందికి ఉపయోగపడుతున్నయో ఆలోచించుండ్రి. ప్రైవేట్ దవాఖానలల్ల కూడా దొర్కని సౌలతులు ఇక్కడ అయినయ్. ఇప్పుడు సుస్తీ చేస్తే బస్తీ దాటాల్సిన అవసరం లేదు. ఈసారి కూడా కేసీఆర్ సార్ గెలిస్తే.. బస్తీ దవాఖానలే సూపర్ స్పెషాలిటీ దవాఖానల లెక్క మారుతయేమో. నాకైతే ఆయనే వస్తడు.. చెప్పినవి చేస్తడన్న నమ్మకం ఉంది.

-బాబు, టిఫిన్ సెంటర్, ఎల్లారెడ్డిగూడ, జూబ్లీహిల్స్

